
కళ్ళు మూసుకుని కూచొని, యెవరూ నీవైపు చూడ్లేదని యేడిస్తే లాభంలేదు. నీ కళ్ళు పొడిచి ఆడుకోవాలనుకుంటుంది లోకం. నువ్వు కళ్ళు నులుముకుని చూస్తే, తన కళ్ళువిప్పి చూస్తుంది లోకం. ఆ కళ్ళలో ప్రతిఫలించే భయమూ కనిపిస్తుంది.

*తిరునాళ్ళలోలా పరిగెత్తుతున్న మనుషులతో కిటకిటలాడుతున్న చౌరస్తాకు ప్రక్కన ఆకాశాన్నంటుకునేందుకు ప్రయత్నిస్తున్న ఓ మోడ్రన్ లాడ్జి క్రింద హోటలువాళ్ళు ఎన్నడూ ఊడ్వని అరుగు మీద పడివున్నాడు అతను- ఎవడో ఆఫీసర్ కసితో ఉండగా పిసికి చెత్తబుట్టలో కుక్కబడ కాగితంలా*



# కళ్ళు నులుముకోని చూసుకో

రామాచంద్రమౌళి

**అతను** బలవంతంగా కను రెప్పలను తెరిచాడు అట్లాస్ భూమండలాన్ని లేబట్టినట్టు.

ఎదురుగా అప్పటినుంచి ఫెళఫెళమన్న యెండలేదు. మాయమైపోయి సన్నగా చీకటిలా ఏదో పొర వ్యాపించింది. ఆకాశం లేత నలుపురంగులో మబ్బులు పడుతోంది చల్లగా గాలి వీస్తోందిదుమ్మును చిమ్ముతూ. ముందర దూరంగా యమ భటునిలా గద్దె మీద పోలీస్ చేతిలో "స్టాప్" తో నాట్యమాడుతున్నాడు. మధ్య మధ్య ఊర్కే ఉంటే బాగుండదనికాబోలు విజిల్ ఊదుతున్నాడు.

కళ్ళు గుంజుతున్నాయి రెప్పల బరువుకు. మూసుకుని గుండెల్లోకి చూసుకున్నాడతను. ఒంటిలో రక్తం లేదు. అంతా మట్టినీరు.

అతనికి వాతావరణమంతా ప్రళయంలా వుంది. ప్రపంచమంతా ఏవో భయంకర శబ్దాలతో నిండి మృత్యుగుహలా గుడగుడ చప్పుళ్ళతో పెద్దగా ధ్వనిస్తోంది. ఆ ధ్వనిలో తనెక్కడికో జారిపోతున్నాడు.

గాలి లీక్ ఔతున్న బుడగలా మూల్గాడతను. మూల్గి యింకా దగ్గరగా ముడుచుకు పడుకున్నాడు గజ్జి కుక్కలా.

లోపల కడుపులో నుంచి ఏదో చలి తెరలా ముంచుకొస్తున్నది. కళ్ళకు చీకటి చీకటిగా, మసకమసగ్గా - ఏ మి టి ది .... ప్రేగుల్లో చప్పుడు.... గుర్ ర్ ర్ మని పొట్టలో అవయవాలు అరుస్తున్న శబ్దం. బొడ్డు దగ్గర నుంచి ఒళ్ళంతా నిస్సత్తువను ఎగజిమ్ముతున్నట్టు ఏదో అగ్గి బిందువు.

"క్యా యిస్కా చాబీ మిలేగా"

"హాఁ.... సాబ్. యహా దీజియే"—యిటు ప్రక్కగా తాళాల రిపేర్ వాడు. వాని చేతిలో ఏదో కిటకిట చప్పుడు.... తాళం వేస్తున్నాడు. తీస్తున్నాడు. వేస్తున్నాడు. తీస్తున్నాడు.


జర్ ర్ ర్ మని వాహనాలు అడుస్తూ పోతూనే ఉన్నాయి.

"తొండా లెట్టిత్తానా".

"తొమ్మిది రూపాల్".

"యాడ్డి మొన్న మావోడు తేలే ఏడ్రూపాలకు" నోట్లో చుట్ట తీసి తుపుక్కున ఉమ్మేశాడు ఎలుగ్గొడ్డులాంటి పల్లెటూరి మనిషి.

"యింగో ఐదు రూపాలై కూడా ఉండై నువ్వు తోలు చూస్కో. చూసి మాట్లాడు"



వెంటనే తోలు తొండాన్ని ఫుట్‌పాత్ మీద చరిచిన చప్పుడు. తర్వాత నిశ్శబ్దం. మాదిగ వానిదగ్గర ఎలుగ్గొడ్డు మనిషి తోలును చూస్తున్నట్టున్నాడు చుట్టూ పరుగెత్తే జనం. వాళ్ళను మోసే సరంజామా అంతా రొద రొద.

సైకిల్ బెల్‌ల గణగణ—

లారీల ర్ ర్ ర్ ర్.... మోతలు—

పోలీసు విజిల్ కూతలు. అంతా కురుక్షేత్రంలో రణరంగంలా వుంది.

అతను కొద్దిగా కదిలాడు మన్ను తిన్న పాము కదిలినట్టు. ఇంకా నీరసం నిముషానికి వేయిరెట్ల చొప్పున పెరిగిపోతోంది. కళ్ళలో గునపాలను గుచ్చి పొడుస్తున్నట్లు కాళ్ళను గొడ్డళ్ళతో నరుకుతున్నట్టు.... కడుపులో గంపెతో కలియబెడుతున్నట్టు బాధ ఎందుకు ఎందుకిలా ఈ నిస్సత్తువ ముంచేస్తోంది వరదలా.

ఆకలి.... ఆకలి...

కడుపులో గుర్ ర్ ర్ మనే శబ్దం పిడికెడు మెతుకుకోసం అడుస్తోంది.

కాని యెలా.... కదలలేడతను. అరుద్దామంటే అడుక్కుందామంటే నోరు విప్పే చేవకూడాలేదు. ఇంకా యిట్లాగే యింకో రోజుంటే చచ్చిపోతాడు తనుతప్పకుండా.

ఆకలి .... ఆకలి .... ఆకలి-ఈ ఆకలి వొంటిని బలిపించుకునేందుకు కాదు. నడిచి, ఉరికి దేన్నో సాధించి యెవని కడుపునో కొట్టేందుకు కాదు.

ప్రాణాలను నిలుపుకునేందుకు కనీసావసరానికి. అయ్యో యెలా చుట్టూ యింత మంది. యిన్ని వందలమంది కార్లవాళ్ళు, స్కూటర్లవాళ్ళు, సైకిళ్ళవాళ్ళు, బొగ్రల వాళ్ళు, బికార్లు, ఆడవాళ్ళు, మగవాళ్ళు ఎవరికీ తను కనిపించడంలేదా. అరవాలి అడుస్తేనైనా యెవరన్నా చూస్తారేమో చూసి యేదైనా.

"ఆ....ఆఁ...." ఉహుఁ నోరు రావడం లేదు. గొంతు పెగలడంలేదు. దీనంగా నిస్సహాయంగా చూశాడు ఆకాశంలోకి. ఆ క్షణంలో కన్నీళ్ళు రాలేదు అతని కళ్ళలోకి. వాటిని యెప్పుడో త్రాగేశాడు.

"పాలిష్ సార్....పాలిష్."

"సార్ సార్ పదిపైసలే సార్. బొంబాట్‌గా చేత్తా."

ఒక కుర్రాడు వంగి చిన్న చిన్న రాళ్ళను ఏరుతున్నాడు. ఇంకొకడు పల్లికాయలు తింటూ పొట్టును మరో చేతిలో కుప్పగా దాస్తున్నాడు. దాస్తూ "ఏఁ.... మామా బాగున్నావా" అని. "అరే రాబే" వస్తున్నారు అతనివైపు.

అతను యింకా కుంచించుకుపోయి ముడుచుకున్నాడు వొంటిని.

ఓ రాయివచ్చి పడింది పైన.

తర్వాత ఓ పల్లిపొట్టు గుల్ల, యింకో రాయి.

ఒకటి వెనుక వొకటి పడుతున్నాయి మీద వానలా.

నవ్వుతున్నారు పాలిష్ కుర్రాళ్ళు సంతోషంగా. వాళ్ళకుహింసించడంసరదా.

అతను నరకయాతన అనుభవిస్తున్నాడు కదలలేని స్థితిలో చుట్టూ కాలి యముళ్ళలా రాబందుల్లా నిలబడి చిత్రవధ చేస్తున్న వాళ్ళను నమిలేయాలన్నంత వుక్రోషం ముంచుకొస్తోంది. కాని....కాని లాభంలేదు. తను కదలలేడు, మెదలలేడు చచ్చిన మనిషిలా మిగిలిపోయిన తను వాళ్ళను ప్రతిఘటించలేడు.

చుట్టూరా యింతమంది మనుషులు చదువుకున్నవాళ్ళు, అంతా తెలిసినవాళ్ళు పోలీసులు అందరూ వుండి ఒక మనిషిని యింకో మనిషి యిలా హింసిస్తూంటె చూస్తూ ఊరుకుంటారేం. ఒక్కడూ మందలించడేం?

ఇంకా రాళ్ళు పైన పడుతూనే వున్నాయి. కడుపుమీద, ఒంటిమీద, ముఖంమీద.

"ఊ .... పోం .... డ్లి .... రా...." గొణుగుతున్నట్టుగా అన్నాడు.

"హిహిహి—" యింకొంచెం బిగ్గరగా నవ్వుతున్నారు. యింకొంచెం బలంగా రాళ్ళతో కొడుతున్నారు.

"అమ్మా.... ఓ గాడిదకొడుకా...." తుపాకిగుండు తగిలినంతపనయిందతనికి.

"హహహ.... మామా. నీ బిడ్డగిత్తవా" యింకో రాయి.

"అయ్యో నా ఎంబడెందుకు తాకిండ్లురా గాడిద కొడుకుల్లార..... ఊఁ" మూల్గుతున్నాడు.

ఇంకొకడు ఓ పొడుగాటి కర్రతో మెల్లిగా పొడుస్తున్నాడు వీపుమీద యింకో వైపు నుండి.

"అయ్యో మీ పెండ్లాలు ముండమొయ్య. అయ్యో అయ్యో ఊఁ" ఎవరూ వినిపించుకోవడంలేదు. కనీసం చూడనైనా చూడ్డంలేదు. పోతూనే వున్నారు ఎవరి తోవన వారు- ఎవరి పనిమీద వాళ్ళు.

ర్ ర్ ర్ లారీల చప్పుడు ఙ్ ఙ్ ఙ్.... సైకిల్ గంటల మోతలు- వినబడుతూనే వున్నాయి.

ముఖంపైన ఈగలు, ఒంటిపైన రాళ్లు కడుపులో ఆకలి, చుట్టూరా రాక్షసుల్లా పాలిష్ కుర్రాళ్ళు నవ్వుతున్న వాళ్ళ ముఖాలు. వాళ్ళ చేతుల్లో యింకా రాళ్ళు—

"అయ్యో దేవుడా...."

ఇద్దరు ముగ్గురు రిక్షావాళ్ళు వచ్చారు ఆ మూలమీదికి మాట్లాడుకుంటూ, రిక్షాలను లాక్కుంటూ. వస్తూనే పాలిష్ కుర్రాళ్ళనూ, వాళ్ళు చేస్తున్న ఘనకార్యాన్నీ చూసి "ఏందిరో- మామనేమో సేత్తాండ్లు" అన్నారు.

"బిడ్డనియ్యిమంటన్నం."

"ఓహహహ...." నవ్వుతున్నారు. బిగ్గరగా, పెద్దగా-పాలిష్ కుర్రాళ్ళు, రిక్షా తొక్కే పెద్దోళ్ళు.

ఒకడు బీడీ ముట్టించుకుని ఆర్పిన అగ్గిపుల్లను విసిరి అతనిమీద పారేశాడు. అది చుయ్యమని ఆరిపోయింది.

"అమ్మో! .... దొంగముండా కొడుక్కులు మీకేం బుట్టిందిరా." నరాల్లోని నీరులాంటి నెత్తురు పొర్లి పురులు విప్పుకుంటోంది.

"ఇంకో టెయ్‌రా"-కుర్రాడు యింకో రాయి వేశాడు. తర్వాత రిక్షావాడో రాయి. రఁయ్‌మని రాళ్ళు మీదపడుతూనే ఉన్నై.

"అయ్యో. ఓ దొరా. సూడుండ్లీ—లక్డీ కొడుకులు"

—ఉహు! ఎవ్వరూ వినడం లేదు. ఎవరూ పట్టించుకోవడం లేదు వెళుతూనే వున్నారు ఎవరి తోవన వారు.

"ఏంది బే సూ చేది. నీ బిడ్డను సూపియ్యి" యింకా నవ్వుతున్నారు చుట్టూ ఆర్గురు సంతోషంగా. ఎదురుగా అతను చిన్నపిల్లాడికి పిడతలా కనిపిస్తున్నాడు.

## సినిమా డైరీ

తెలుగు సినీతారల అడ్రసులేకాక, వారి పుట్టినరోజులు, తొలి చిత్రాలు, హాబీలు గల సినిమాడైరీతోపాటు ఒక అందాల సినీనటి ఫొటో కావాలంటే 3రూ॥లు. కేవలం ఒక సినిమా డైరీ మాత్రమే కావాలంటే రూపాయిన్నర. ఈ క్రింది అడ్రసుకు మనియార్డరు చేయండి.

వై. కె. మూర్తి,

దాసరివారి వీధి, విజయవాడ–2.

SUVARNA

ఉచితం ఉచితం ఉచితం

## తెల్ల మచ్చలు

మా చికిత్సవల్ల తెల్లమచ్చలు గలవారికి పూర్తిగా నయం అవడం ద్వారా మా వైద్యం మంచి కీర్తిని పొందింది. ప్రచారం నిమిత్తం ఒక ప్యాకెట్టు మందు ఉచితంగా ఇవ్వబడును. మొదటి కోర్సుతో నే మచ్చల రంగు మారడం ఆరంభమవుతుంది. జబ్బు వివరాలు వ్రాయండి.

GAUTAM CHIKITSALAYA
(S-DD)
(P.O.) KATRI SARAI (GAYA)

INSTITUTE of B.A/ B.Com.,
Entrance. CORRESPONDENCE COURSES / ORAL (College)

Those who complete 20 years are directly eligible for the courses.

Contact :
C/o ARUNA TYPE INSTITUTE,
Door No 30-6-1,
Near Premasamajam,
VISAKHAPATNAM–4,

Prospectous : in person Rs. 3/- by M. O or D. D, Rs. 3-50

...వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవఘర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మ వ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. మొలలు(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.

డా॥ దేవర, షాపు 551, మార్వాడి గుడివద్ద, తెనాలి.

బ్రాంచి : 26, నార్త్ బోగ్‌రోడ్, మద్రాసు–17

## తెల్ల వెంట్రుకలు

హెయిర్ డై ద్వారాకాదు. మా సెంటెడ్ ఆయుర్వేదిక్ మన్ మోహిని హెయిర్ ఆయిల్ మీ వెంట్రుకలను శాశ్వతముగా ప్రకృతి సిద్ధమైన నల్లరంగు నిస్తుంది. ఆలోచనతో పనిచేసేవారి పాలిటి వరం.

ధర రు. 12/—
ఫుల్ కోర్సు రు. 31/—

JANATA AYURVED BHAWAN
(P) P.O. Lalbigha (Gaya)

ఉచితము! ఉచితము!

## తెల్లమచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.

Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

వాడండి ముఖ్యంగా అలసినవారికి...

SEALED PACKING ... TABLETS
AVAILABLE AT ALL CHEMISTS

Mfrs. SEENU & CO., MADRAS-21

## లాల్‌చంద్ ఫోటోస్టాట్

వెంకట్రావుపేట పోస్టాఫీసు వద్ద, ఏలూరు.

ఫోన్ 787

- సర్టిఫికెట్లు
- మార్కులషీట్లు
- దస్తావేజులు
- క్లియరెన్సు సర్టిఫికెట్లు
- త్రైతప్రతులు

మొదలగువాటి కాపీలకు దయచేయండి!

ఫోటోస్టాట్ కాపీలకు ఎటెస్టేషను అవసరము లేదు!


సరదాగా నవ్వుకుంటున్నారు అతన్ని హింసిస్తూ.

"తుఫ్...." ఒకడు మ్మేశాడు బలంగా. వచ్చి అతని ముఖం మీద కళ్ళపై బడింది.

"మిమ్మల్నేమన్నరా నేను- గాడిద కొడుకుల్లారా" అరిచాడు బిగ్గరగా.

ఎలా అరవగలిగాడు తను. యీ చేవెక్కడిది.

ఇంకో రాయి. యింకో ఉమ్మి ముద్ద. యింకో పల్లికాయ పొట్టు - పడుతూనే ఉన్నాయి మీద. వాళ్ళు నవ్వుతూనే వున్నారు. సంబరపడుతూనే ఉన్నారు.

"అరే.... మీ...." కొద్దిగా కదలాడు. పౌరుషం నరాల్లో పొంగుతోంది. చేయిని కదిలించాడు.

కుర్రాడు కర్రకొసతో మెల్లగా అతని పిర్రలపై గుచ్చి కెవ్వన నవ్వాడు బంగారం దొరికినంత సంతోషంతో. చుట్టూ అందరూ నవ్వారు బిగ్గరగా. నవ్వుతూనే వున్నారు వికృతంగా రాళ్ళు విసురుతూ కర్రతో పొడుస్తూ - చౌరస్తాలో జనం పెరిగిడుతూనే వున్నారు యిదంతా చూస్తూ కొందరు, చూడక కొందరు.

అతనిపొంట్లో అగ్గి రాజుకుంది. నిస్సత్తువ అదృశ్యమై పోతోంది. అనవసరంగా తనను హింసిస్తూ చుట్టూ నిలబడ్డ వాళ్ళను చీల్చేయాలన్నంత ఆవేశం సుళ్ళు తిరుగుతోంది కళ్ళలో. విజృంభించాలి. వాళ్ళను చంపెయ్యాలి. లేకుంటే వాళ్ళ ముందర యిలాగే చచ్చిపోతాడు తను.

ఉక్రోషం పడగెత్తింది.

ఉద్రేకం గర్జించింది.

ప్రతీకారజ్వాల బుసకొట్టింది గుండెల్లో కసి....కసి....కసి.

కసి సుళ్ళు తిరుగుతోంది.

మెరుపులా లేచి చేతికందిన రాయిని తీసి విసురుతున్నాడు. చుట్టూ కనబడ్డదాంతో పుద్యమిస్తున్నాడు. కెరటంలా విజృంభిస్తున్నాడు. ఏది దొరికితే దాంతో కొడుతున్నాడు.

పాలిష్ కుర్రాళ్ళ, రిక్షావాళ్ళ నవ్వు చటుక్కున ఆగిపోయింది.

వాళ్ళకు అప్పటినుంచి ఆటవస్తువుగా కనబడ్డ అతను యిప్పుడు మంటలా కనిపిస్తున్నాడు. జ్వలిస్తున్నాడు.

ఇక లాభం లేదు.

పరుగెత్తుతున్నారు. ఎవరికి వారు దూరంగా ఎటో. ఎటు తోస్తే అటు. జనంలో కలిసి కనబడకుండా.

"పాగల్‌కో పకిడో...." అప్పటినుండి కనీసం అటు దిక్కు చూడనైనా చూడని పోలీసు హీరోలా విజిల్ ఊదుతున్నాడు అతన్ని పట్టుకునేందుకు. ●